సాక్షి
విజయనగరం
శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



అడవితల్లి ఒడిలో ప్రశాంత జీవనం

నవ్యసమాజానికి దూరంగా కొండకోనల్లో జీవనం సాగించే వారే గిరిపుత్రులు. ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయాల నడుమ ఆదివాసీల జీవనం వైవిధ్యంగా సాగుతోంది. - 8లో



ముర్రుపాలు అమూల్యం

బిడ్డ పుట్టిన ఐదు నిమిషాలలోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు ఎంతో అమూల్యమైనవని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. - 8లో



తప్పుడు రిజిస్ట్రేషన్ కలకలం

భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్‌పై కలకలం రేగింది. - 8లో

న్యూస్‌రీల్

గాయత్రీమాతకు పసుపు కొమ్ములతో అలంకరణ



పసుపు కొమ్ములతో అలంకరించిన గాయత్రీమాత

రాజాం సిటీ: రాజాం గాయత్రికాలనీలో వెలసిన గాయత్రిమాతను పసుపు కొమ్ములతో ఆలయ ధర్మకర్త కొండవేటి వివేకానంద, ఆలయ అర్చకులు వాస జగదీశ్వరరావు గురువారం అలంకరించారు. శ్రావణ మాసంలో వచ్చే మూడో శుక్రవారాన్ని పురస్కరించుని అమ్మవారిని అలంకరించినట్టు అర్చకులు తెలిపారు.

వైవాహిక బంధంపై అవగాహన కల్పించాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

విజయనగరం ఫోర్ట్: అమ్మాయి, అబ్బాయిలకు వైవాహిక బంధంపై అవగాహన కల్పించిన తర్వాతే పెళ్లిజరిపించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలోని వన్‌స్టాప్ సెంటర్‌లో గురువారం కొత్తగా ప్రీ మేరిటల్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. దీనిపై రుపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పెళ్లి చేసుకోబోయే అమ్మాయి, అబ్బాయి ఈ కేంద్రాన్ని సంప్రదిస్తే పెళ్లి గురించి, ఆ తర్వాత కలిగే లాభనష్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. దీనివల్ల వివాహ జీవితం ఆనందంగా సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విమలారాణి, డీఎల్ఓ డాక్టర్ రాణి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సాయి విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నిఘా




టూటౌన్ పీఎస్ పరిధిలో ఏర్పాటైన సీసీ కెమెరా

విజయనగరం క్రైమ్: విజయనగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం కొత్తగా 16 సీసీ కెమెరాలను అమర్చారు. నేర నియంత్రణలో భాగంగా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు వైఎస్సార్ నగర్, మెడికల్ కాలేజ్, కాట వీధి, డబుల్ కాలనీ తదితర చోట్ల సీసీ కెమెరాలు పెట్టామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. వీటి సాయంతో నేర ప్రవృత్తికలిగిన వ్యక్తుల కదలికలపై నిఘావేస్తామన్నారు.

పంచాయతీలకు నిధులు రాక ఇబ్బందులు

- జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



బూసాయవలస సచివాలయం సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ

రామభద్రపురం: పంచాయతీలు, మండల పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో రాకపోవడంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నది వాస్తవమేనని జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ అన్నారు. రామభద్రపురం మండలంలోని బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాలను ఆయన గురువారం సందర్శించారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి పథక పనులను పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ తీరును ఆయా గ్రామాల మహిళలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి పథకాల శుభ్రత తేదీలు తెలిపేలా బోర్డులు ఏర్పాటుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. క్లాప్ మిత్రలకు వేతన బకాయిలు లేకుండా చూడాలన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా 30 నుంచి 40 మంది మహిళలతో క్లస్టర్ ఏర్పాటు చేసి వారిలో ఒకరిని క్లస్టర్ కోఆర్డినేటర్ నియమిస్తూ పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ సన్యాసిరావు, వెంకటరమణ, పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో.. బిల్లుల షాక్..!

- స్మార్ట్ మీటర్లు వద్దంటున్నా పట్టించుకోని కూటమి సర్కారు
- జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు: 7,24,821
- ఇప్పటివరకు బిగించిన మీటర్లు: 35,442
- వాణిజ్య కనెక్షన్లకు బిగించిన స్మార్ట్‌మీటర్లు: 21,060
- గృహాలకు బిగించినవి: 2,856
- ప్రజలు వ్యతిరేకిస్తున్నా కొనసాగుతున్న మీటర్ల బిగింపు



'గంట్యాడ మండలానికి చెందిన టి.ఈశ్వరావు అనే వ్యక్తి ఇంటికి విద్యుత్‌శాఖ సిబ్బంది స్మార్ట్ మీటర్ బిగించారు. ఈ మీటరు బిగించకముందు రూ.500 నుంచి రూ.600 బిల్లు వస్తే ప్రస్తుతం అతనికి రూ.1500 బిల్లు వచ్చింది.'

'విజయనగరం పట్టణానికి చెందిన రమణ అనే వ్యక్తికి కిరాణా దుకాణం ఉంది. అతని ఇంటికి కూడా విద్యుత్‌శాఖ సిబ్బంది స్మార్ట్ మీటర్ బిగించారు. గతంలో విద్యుత్ బిల్లు రూ.600 వచ్చేది. స్మార్ట్ బిగించిన తర్వాత రూ.1200 బిల్లు వచ్చిందంటూ రమణ వాపోయాడు.'

'విజయనగరం పట్టణంలోని పూల్‌బాగ్ కాలనీలో స్మార్ట్ మీటర్లు బిగించడానికి వచ్చిన విద్యుత్ సిబ్బందిని కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఎవరి మేలుకోసం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారంటూ సిబ్బందిని నిలదీశారు. ఈ మీటర్లు మాకొద్దంటూ తెగేసి చెప్పారు.'

విజయనగరం ఫోర్ట్:

కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో జోరు పెంచడంతో వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రెట్టింపు బిల్లులు వస్తున్నాయంటూ గగ్గోలు పెడుతున్నారు. ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై నానా యాగీ చేసిన కూటమి నేతలు ఇప్పుడు కిమ్మనకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

ఇదీ లెక్క..

జిల్లాలో 7,24,821 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేటగిరీ–1 కనెక్షన్లు 6,04,513, కేటగిరీ–2 కనెక్షన్లు 65,194, కేటగిరీ–2 కనెక్షన్లు 2,822, కేటగిరీ–4 కనెక్షన్లు 14,168, కేటగిరీ–5 కనెక్షన్లు 38,124 ఉన్నాయి. జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి 35,442 స్మార్ట్ మీటర్లు బిగించారు. వీటిలో గృహాలు, వాణిజ్య కనెక్షన్లు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఈ నాలుగు కేటగిరీలకు సంబంధించి 91,267 కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించాలని విద్యుత్‌శాఖ అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే, స్మార్ట్ మీటర్లు బిగింపుతో విద్యుత్ వినియోగదారులకు కూటమి సర్కారు బిల్లుల షాక్ ఇస్తోందని జనం మండిపడుతున్నారు.



అయ్యన్నపేట కూడలి వద్ద షాపులకు బిగించిన స్మార్ట్ మీటర్లు

మీటర్ల ఏర్పాటు కొనసాగుతోంది

ప్రస్తుతం గృహాలు, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్ల బిగింపు జరుగుతోంది. ఇప్పటివరకు 35,442 కనెక్షన్లు బిగించాం. ఇంకా స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమం కొనసాగుతోంది.

– ముప్పల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

డీపీటీసీ పరిశీలన

- ఆరంభం కానున్న పోలీస్ అభ్యర్థుల శిక్షణ తరగతులు



జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఇతర పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: సారిపల్లిలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీపీటీసీ)ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ గురువారం పరిశీలించారు. త్వరలో సుమారు 150 మంది ట్రైనీ కానిస్టేబుళ్ల శిక్షణకు రానున్నందున, అవసరమైన అన్ని మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ కేంద్రంలోని తరగతి గదులు, వంటగది, డైనింగ్ హాల్, స్టోర్, వాష్‌రూమ్, స్నానపు గదులు, లైబ్రరీ, పరేడ్ గ్రౌండ్, ఫైరింగ్ రేంజ్‌లను ఎస్పీ పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో కంప్యూటర్లు, ఫ్యాన్‌లను వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి తాగునీటి సరఫరాకు అంతరా యం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట అద నపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వరరావు, సీఐలు ఎ.వి.లీలారావు, జి.రామకృష్ణ, బి.లలిత, ఏఆర్ ఎస్ఐ జి.గోపాలనాయుడు, నెల్లిమర్ల ఎస్ఐ గణేష్, తదితరులు ఉన్నారు.

నాటుతుపాకీల ఏరివేతకు కార్డన్ సెర్చ్

- ఎస్పీ వకుల్ జిందల్



పోలీస్ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: నాటు తుపాకులు వినియోగించడం చట్టరీత్యా నేరమని, గిరిజనులు, వేటగాళ్ల వద్ద ఉన్న నాటు తుపాకీల ఏరివేతే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందల్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్ నుంచి మూడు సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లైసెన్సు లేకుండా తుపాకుల వినియోగించడం చట్టరీత్యా నేరమన్న విషయాన్ని గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అడవి పందుల నుంచి పంటలను రక్షించుకునేందుకు, వేటాడేందుకు కొంత మంది నాటు తుపాకులను అనధికారంగా వినియోగిస్తున్నట్టు మా దృష్టికి వచ్చిందన్నారు. క్షేత్ర స్థాయిలో నాటు తుపాకులు వినియోగించే వ్యక్తుల సమాచారాన్ని సేకరించాలన్నారు. సోదాల్లో గంజాయి, సారా, నాటు తుపాకులు లభ్యమైతే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పుష్పధరహాసం



రాజాం: పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఓ వైపు పెళ్లిళ్ల సీజన్, మరోవైపు శ్రావణ శుక్రవారం, మంగళవారం పూజలతో పూలకు డిమాండ్ పెరిగింది. గతంలో కంటే కిలోకు రూ.100లు నుంచి రూ.400లు ధర పెరిగింది. రాజాంలో కిలో మల్లెలు రూ.800 నుంచి రూ.900లు, చామంతి రూ. 450, బంతిపూలు రూ.200, లిల్లీలు కిలో రూ.350, గులాబీలబుట్ట ధర రూ.750లు, కనకాంబరాలు బారు ధర రూ.350, వివాహ దండలు రూ.800లు నుంచి రూ.2,500లు మధ్య, గులాబీ పెళ్లి దండలు రూ.1200లు, గుమ్మపు దండలు రూ.1000లు చొప్పున పలుకుతున్నాయి. చామంతి ధర గతంలో కంటే కిలోకు రూ.150లు పెరగగా, కనకాంబరాల దండలు ధర గతంలో కంటే రెట్టింపు అయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కడియం, ఆలమూరు, ఆత్రేయపురం, చిత్తూరు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఇక్కడి వ్యాపారులు పూలను దిగుమతి చేసుకుంటున్నారు.

ప్రైవేటు విద్యపై పర్యవేక్షణ లోపం

- గుర్తింపులేని ప్రైవేటు పాఠశాలలపై కలెక్టరేట్‌కు ఫిర్యాదుల వెల్లువ
- ఈ విద్యాసంవత్సరంలో పీజీఆర్ఎస్‌కు 57 ఫిర్యాదులు
- ఒక స్కూల్‌కి గుర్తింపు తీసుకొని నాలుగు స్కూళ్లు నడుపుతున్న వైనం
- ప్రభుత్వ పాఠశాలల పిల్లలే లక్ష్యంగా ప్రవేశాల గాలం



గుర్తింపు లేకపోవడంతో ప్రైవేటు స్కూల్‌ను మూసివేయిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

విజయనగరం అర్బన్:

'అనుమతులు లేకుండా విజయనగరం జిల్లా కేంద్రం నడిబొడ్డున చైతన్య భారతి ప్రైవేటు విద్యాలయం నిర్వహిస్తున్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావినతుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో రెండుసార్లు ఫిర్యాదుచేశారు. రెండోసారి ఫిర్యాదు రావడంతో విద్యాశాఖ అధికారులపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సీరియస్ అయ్యారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండునెలలు కావస్తోందని, ఇంతవరకు క్షేత్రస్థాయి పరిశీలన చేయలేదా? అంటూ ఆగ్రహించారు. ఆయన ఆదేశాల మేరకు తనిఖీ చేసిన అధికారులు చైతన్య భారతి స్కూల్‌కు గుర్తింపులేదని నిర్ధారించి సీల్‌వేశారు. జిల్లా కేంద్రంలోనే ఎలాంటి గుర్తింపులేకుండా పాఠశాలలు నిర్వహిస్తుంటే జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. విద్యార్థుల భవితవ్యం ఏమవుతోందన్న అంశం చర్చనీయాంశంగా మారింది.'

ఫిర్యాదులు వస్తున్నా...

ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఇంతవరకు వివిధ పాఠశాలలపై వివిధ సమస్యలపై పీజీఆర్ఎస్‌కు 57 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో అత్యధికం తల్లికి వందనం ఉంటే ప్రైవేటు స్కూళ్ల అక్రమ ఫీజుల వసూళ్లు, అసౌకర్యాలపై అధిక వినతులు అందాయి. విద్యాశాఖ అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేకపోవడం వల్లే వసతుల లేమిపైనా ఫిర్యాదులు అందుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు 434 నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, చాలా పాఠశాలకు మైదానాలు, తాగునీటి సదుపాయం, గ్రాంథాలయాలు, పక్కా భవనాలు వంటివి లేవు. కొన్ని పాఠశాలలు పూర్తిగా రేకులషెడ్‌లలోను, పెట్రోల్ బంకుల సమీపంలో నిర్వహిస్తున్నారు.

ఒక స్కూల్ గుర్తింపుతో నాలుగు స్కూళ్ల ఏర్పాటు

బొబ్బిలి, విజయనగరం, చీపురుపల్లి, ఎస్.కోట, కొత్తవలస ప్రాంతాలతో పాటు వివిధ మండల కేంద్రాల్లో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. ఒక అనుమతి తీసుకుని, పట్టణంలోగాని పక్క మండల కేంద్రంలోగాని ఒకే సంస్థ పేరుతో మూడు నుంచి నాలుగు శాఖలను నడుతున్నాయి. ప్రత్యేకించి రాష్ట్ర వ్యాప్తంగా పేరు పొందిన రెండు సంస్థలు ఇదే పద్ధతిలో విద్యాలయాలు నిర్వహిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటి వెనుక ఉన్న రాజకీయ నేతల అండదండలతో వాటిజోలికెళ్లేందుకు అధికారులు భయపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండల కేంద్రాలు, పెద్ద గ్రామాల్లో సుమారు 29 పాఠశాలలు గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నట్టు సమాచారం.

గుర్తింపులేని స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం

విద్యాసంవత్సరం ప్రారంభమైనందున కొత్తగా పాఠశాలలకు అనుమతి, గుర్తింపు ఇవ్వడం లేదు. గుర్తింపులేని స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం. సరైన నిబంధనలు అమలు చేయని పాఠశాలలు ఉంటే వాటి గుర్తింపును రద్దు చేస్తాం. పాఠశాలలను తనిఖీ చేయడంతోపాటు నిబంధనలు అమలయ్యేలా చూస్తాం.

– యు.మాణిక్యంనాయుడు, డీఈఓ



జామి మండలంలో ఓ ప్రైవేటు స్కూల్ నడుస్తున్నది ఈ రెకుల్‌షెడ్‌లలోనే..

చంద్రబాబు పతనం ఆరంభం

- రాష్ట్రంలో 50 శాతం ఓటర్లు ఉన్న బీసీలపై దాడులా...?
- బీసీలు కన్నెర్ర చేస్తే టీడీపీ బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు మహంతి జనార్దన్
- కడప ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడిని ఖండించిన జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు
- జిల్లా కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిరసన



మహాత్మాజ్యోతీరావు పూలే విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల నిరసన

విజయనగరం:

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పతనం ఆరంభమైంది. రాష్ట్రంలో 50 శాతానికి పైబడి ఓటర్లున్న బీసీ నాయకులపై దాడులను ప్రోత్సహించడం ఆయన చేసిన ఘోర తప్పిదమని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు మహంతి జనార్దన్ హెచ్చరించారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు, నాయకులు చేసిన దాడిని, హత్యాప్రయత్నాలను ఖండించారు. బీసీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విజయనగరం కలెక్టరేట్ కూడలి వద్ద ఉన్న జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ముందుగా మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులంతా నివాళులర్పించారు. అనంతరం బీసీ నాయకునిపై జరిగిన దాడికి నిరసనగా సీఎం చంద్రబాబు డౌన్‌డౌన్... బీసీల ఐక్యత వర్ధిల్లాలి, బీసీలపై దాడులు సిగ్గుసిగ్గు అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఏడాది వ్యవధిలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న చంద్రబాబు, తాజాగా ప్రకటించిన ఉపఎన్నికల్లో ఓటమి భయంతో దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌తో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరల అటువంటి చర్యలకు ఆస్కారం లేదని, ఓడిపోతే పరువుపోతుందన్న భయం పట్టుకుందంటూ ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీసీలంతా ఐకమత్యంగా ఉండి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు.

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను ఓటమి భయంతో చంద్రబాబు అతని అనుచరులతో అల్లకల్లోలం సృష్టించేందుకు ప్రయత్నించారన్నారు. గెలుపుకోసం ఎన్ని అడ్డదారులు తొక్కినా.. ప్రజలు మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శులు బమ్మిడి అప్పలనాయుడు, బొమ్మి శ్రీను, పార్టీ జిల్లా నాయకులు వర్రి నరసింహమూర్తి, ఎస్.బంగారునాయుడు, అల్లు అవినాష్, కె.సాయి కుమార్, డోల మన్మథకుమార్, పతివాడ కృష్ణవేణి, కె.శ్రీనివాస్, డి. కొండబాబు, ఎ.వేణు, ఎంపీపీ అప్పలనాయుడు, కె.త్రినాథ్, జి.సూర్యప్రకాశ్, లంక వెంకటరావు, అప్పలకృష్ణ పాల్గొన్నారు.

నేను తాగుతూ ఉంటా.. బయట తాళం వేయండి..!

- మద్యం మత్తులో సిబ్బందికి వంగర తహసీల్దార్ హుకుం



మద్యం మత్తులో తన చాంబర్‌లో లేవలేని స్థితిలో తహసీల్దార్ హరిరమణారావు



తన కార్యాలయ చాంబర్‌లో మద్యం మత్తులో ఊగిపోతున్న తహసీల్దార్



తహసీల్దార్ లోపల ఉండగా బయట తాళం వేసి ఉన్న దృశ్యం

వంగర: మద్యం మందిరంగా తన చాంబర్‌ను మార్చిన ఒక తహసీల్దార్ ఉదంతమిది. ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురిచేసిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా వంగర మండల తహసీల్దార్ హరిరమణారావు తన చాంబర్‌లో గురువారం మద్యం మత్తులో ఊగిపోయారు. కార్యాలయ సిబ్బందితో 'నేను లోపలే ఉంటాను.. మీరు బయట వ్యక్తులను లోపలకు పంపకుండా తాళం వేయాలి' అంటూ అంతకుముందు ఆదేశించారు. అనంతరం ఆయన తన గదిలో మద్యం తాగుతూ మత్తులోకి జారుకున్నారు. ఈ తతంగాన్ని వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన వ్యక్తులు గమనించి మీడియాకు సమాచారం అందించారు. మీడియా సిబ్బంది అక్కడకు చేరుకుని సిబ్బందితో గది తాళాలు తీయించారు. ఊగిపోతూ కనిపించిన తహసీల్దార్‌ను చూసి అవాక్కయ్యారు. ఇటీవల ఏఎంసీ వైస్ చైర్మన్ పదవి దక్కించుకున్న అరసాడ గ్రామానికి చెందిన లచ్చుభుక్త ధనలక్ష్మిని కలిసేందుకు గురువారం తాహసీల్దార్ తన సిబ్బందితో వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వచ్చిన తహసీల్దార్ తన చాంబర్‌కు వెళ్లి మద్యం తాగినట్టు సమాచారం. అయితే కార్యాలయానికి ప్రతి నిత్యం తహసీల్దార్ మద్యం సేవించి వస్తున్నారని, కార్యాలయంలో కూడా మద్యం తాగి నిద్రిస్తుండడం పరిపాటిగా మారిందని సిబ్బంది చెబుతుండడం గమనార్హం. ఈ విషయంపై ఆర్డీఓ ఆశయ్య, తహసీల్దార్ హరిరమణారావును ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేసినా లిఫ్ట్ చేయలేదు. కాగా ఈ ఘటనపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందించారు. వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీస్ జారీచేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెంపడాం విద్యార్థులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3 వతేదీన విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ఎంపికలలో పాఠశాలకు చెందిన పి.వెంకటలక్ష్మి (లాంగ్‌జంప్), వి.కల్యాణి (హై జంప్), పి.శ్రీను (100 మీటర్లు, 200 మీటర్లు రన్నింగ్)లు ఎంపికయ్యారు. దీంతో ఈనెల 9,10 తేదీలలో రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లా చీరాలలో జరగబోయే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల హెచ్‌ఎం పి.లచ్చన్న, పీడీ గణేష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

జాతీయ పోటీల్లో దివ్యాంగ విజేతకు అభినందనలు



దివ్యాంగ విజేతను అభినందిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు

విజయనగరం అర్బన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో మేధోవైకల్యం గల ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ గేమ్స్ బేస్‌బాల్‌లో కాంస్యపతక విజేత అయిన తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తోషినిని జిల్లా విద్యాశాఖ అధికారి యూ.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు అభినందించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయాలకు వచ్చి అధికారులను తోషిని కలిసింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సాధారణ విద్యార్థుల మాదిరిగానే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కూడా ప్రతిభ చూపడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అనంతరం విజేతను, కోచ్‌లుగా వ్యవహరించిన పి.సునీల్, ఎస్.బంగారునాయుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు, సహ సమన్వయకర్త ఎం.భారతి, తెర్లాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఎం రమేష్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుతుపాకీతో ఇద్దరి అరెస్ట్



అరెస్ట్ చేసిన వ్యక్తులతో సీఐ అప్పలనాయుడు, ఎస్సై సుదర్శన్ సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో నాటుతుపాకీ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేయడంతో నాటుతుపాకీ పట్టుబడినట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. సోంపురం గ్రామానికి చెందిన గొర్లె ఈశ్వర్రావు ఇంటిలో తనిఖీలు నిర్వహించగా నాటుతుపాకీ పట్టుబడినట్లు చెప్పారు. తుపాకీపై ఆరాతీయడంతో గుడివాడ గ్రామానికి చెందిన రొంగలి బంగారయ్య వద్ద రూ.4500కు కొనుగోలు చేసినట్లు ఈశ్వర్రావు తెలిపాడని చెప్పారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులులేకుండా తుపాకీ కలిగి ఉన్నందున ఈశ్వర్రావును, నాటు తుపాకీ అమ్మడం చట్ట రీత్యా నేరమైనందున విక్రయించిన బంగారయ్యను ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ డార్మిటరీలో వ్యక్తి మృతి



ఆర్టీసీ డార్మిటరీలో మృతి చెందిన కృష్ణమూర్తి

విజయనగరం క్రైమ్: విజయనగరం ఆర్టీసీ డార్మిటరీలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై వన్ టౌన్ పోలీసులకు గురువారం అందిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హెచ్‌సీ ఆవాల రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన సబ్బిశెట్టి కృష్ణమూర్తి(54) శశికాలేజీలో కుక్‌గా పని చేస్తున్నాడు. మందుల కోసం విజయనగరం వచ్చి రాత్రి కావడంతో ఆర్టీసీ డార్మిటరీలో రూమ్ తీసుకుని ఉండిపోయాడు. నిద్ర సమయంలోనే గుండె పోటు రావడంతో మృతి చెంది ఉండవచ్చని మృతుడి అల్లుడు మక్కడపల్లి శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

అడవితల్లి ఒడిలో ప్రశాంత జీవనం

- చూడముచ్చటగా కట్టుబొట్టు, ఆచారాలు
- కొండపోడే ఆధారంగా జీవనం
- మౌలికవసతులు అంతంతమాత్రమే
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రేపు



గిరిజన సంప్రదాయ వెదురు కూరను వంటకు సిద్ధం చేస్తున్న వృద్ధురాలు

సీతంపేట: నవ్యసమాజానికి దూరంగా కొండకోనల్లో జీవనం సాగించే వారే గిరిపుత్రులు. కొండకోనల్లో ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయాల నడుమ ఆదివాసీల జీవనం వైవిధ్యంగా సాగుతోంది. కాయకష్టం చేసి జీవించడం వారి జీవన విధానం. భిన్నమైన సంస్కృతి, సంప్రదాయాలు గిరిజనుల సొంతం. కొండల్లో తమ సంప్రదాయ



ఐటీడీఏలో ఆదివాసీ తల్లి విగ్రహం

వ్యవసాయాన్ని చేసుకుంటూ జీవిస్తున్న గిరిజనుల ఆచార వ్యవహారాలు, కట్టుబొట్టుల్లో మార్పులేదు. అటవీఉత్పత్తుల సేకరణ, పోడుపంటలు, వ్యవసాయ పంటల దిగుబడులు వచ్చినప్పుడు గిరిజనులు ప్రత్యేక పండగలు జరుపుకోవడం ఆనవాయితీ.

విభిన్నం-వైవిధ్యం..

సంప్రదాయ ఆచార వ్యవహారాల్లో ఎంతో వైవిధ్యం కనబరిచే గిరిజనులు అటవీ సంస్కృతికి ప్రతీకలు. ఘన చరిత్రకు వారసులు. వారి ఆధ్యాత్మిక చింతన వినూత్నం.వారి కట్టూ బొట్టూ చూడ ముచ్చటగా ఉంటాయి. తెల్లారితే కొండపోడు వ్యవసాయం, అటవీఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం సాగుతుంది. ప్రతి మూడు నెలలకు ఒక్కో అటవీ ఉత్పత్తుల సీజన్ ఆరంభమవుతుంది. పైనాపిల్, సీతాఫలం, పసుపు, జీడి, కందులు, నిమ్మ, బత్తాయి, పెండలం ఇలా అటవీ ఉత్పత్తులతోనే వారి జీవనం ముడిపడి



నృత్యాలు చేస్తున్న ఆదిమ గిరిజనులు (ఫైల్)

ఉంది. వారం వారం జరిగే వారపు సంతలకు వెళ్లి వారి ఉత్పత్తులు విక్రయించి వారానికి సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుంటారు.

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 819 కిలోమీటర్ల మేర ఏజెన్సీ విస్తరించి ఉంది. 42 వేల 246 గిరిజన కుటుంబాల్లో 2లక్షల 62వేల మంది కుటుంబ సభ్యులున్నారు. మొత్తం 1187 గిరిజన గూడలుండగా వాటిలో ఆదిమ గిరిజనులు నివసించే గూడలు 467 ఉన్నాయి. గిరిజనుల్లో ప్రధానంగా కొండ సవర, జాతాపు, కాపు సవర తెగలున్నాయి. వివాహాలు, పండగలు, వ్యవసాయం తదితర సందర్భాల్లో ప్రత్యేక పండగలు నిర్వహించుకోవడం ఎంతో వైవిధ్యం. భార్యకు కట్నం ఇచ్చి వివాహం చేసుకునే 'మొగనాలి' ఇప్పటికీ కొన్ని చోట్ల అమల్లో ఉంది.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణ ఎందుకంటే..

ఆదివాసీల జీవన స్థితిగతులను ప్రపంచానికి తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి 1194 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ వర్కింగ్ గ్రూప్ ఆదివాసీలపై అధ్యయనం చేసి ప్రపంచ దేశాల్లో ఆదివాసీల సమస్యలన్నీ దాదాపు ఒకేలా ఉన్నాయని గుర్తించింది. దీంతో ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని యూఎన్‌వో ప్రకటించింది.

కొండపోడే ఆధారం..

పోడు వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా కుటుంబాలతో ఆనందంగా జీవిస్తారు. భూ ఉపరితలానికి అత్యంత ఎత్తైన భాగంలో గూడల్లో నివసిస్తూ భయమంటే తెలియదన్నట్లు క్రూరమృగాల నడుమ, విష సర్పాల పడగ నీడలో సాహస జీవితం గడుపుతుంటారు. జిల్లాలోని అటవీ ప్రాంతమంతా ప్రకృతి సోయగాలతో అలరారుతుంది.

అక్షరాలే ఆరాధ్యదేవతలు-లిపివారిప్రాణం..

శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మరో వైవిధ్యముంది. ఇక్కడ అక్షరాలను ఆరాధ్యదేవతలుగా గిరిజనులు పూజిస్తారు. ఏ దేవతకైనా పూజలు చేసినా నైవేద్యంగా సారా పెట్టి పూజ అనంతరం పూటుగా తాగుతారు. జీలుగు సారా వంటివి చెట్టునుంచి దించితే ముందుగా తెడ్డులతో సేవిస్తారు. వారి పండగలు, సంప్రదాయాలను బొమ్మల రూపంలో వేయడంలో వారికి వీరేసాటి. ఏజెన్సీలో అక్షరబ్రహ్మ, మడిబ్రహ్మ వంటి ఆలయాలు వెలిశాయి. అక్కడి గిరిజనులు ప్రతి గురువారం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఆగం పండగ వంటివి చేస్తుంటారు. సవర లిపి ద్వారా కొంతమంది ఆదిమ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వారు వేసే లిపికి మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇటీవల కాలంలో దీనిని అభివృద్ధి చేస్తున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో..

మన్యంలో గిరిజనుల అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. గిరిజనులకు మౌలికవసతులు లేక అల్లాడుతున్నారు. విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు చాలా గ్రామాలకు లేవు. రక్షిత మంచినీటి వ్యవస్థ అందుబాటులో లేదు. అనాదిగా గిరిజనులు ప్రకృతి ఆధారంగానే



పండగలో ఆదివాసీ దేవతలకు పూజలు చేస్తున్న గిరిజనులు



రేషన్ మోసుకుంటూ ఇంటికి తీసుకు వెళ్తున్న మహిళలు

జీవన మనుగడ సాగిస్తున్నారు. సుమారు 120కి పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం ఇప్పటికీ లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అంతంతమాత్రంగా వైద్యసేవలు

ఎపిడమిక్ సీజన్‌లో ఏజెన్సీలో మలేరియా విజృంభిస్తుంది. పీహెచ్‌సీల్లో డాక్టర్ల కొరత వేధిస్తోంది. ఇప్పటి వరకు దోమతెరల పంపిణీ లేదు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య సేవల కోసం ఇంతవరకు హెల్త్ వలంటీర్‌లను నియమించలేదు. పాఠశాలల్లో కనీస మౌలికవసతులైన మరుగుదొడ్లు, అదనపు తరగతుల గదుల సమస్యలు వేధిస్తున్నాయి. గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేవు. అన్ని అటవీ ఉత్పత్తులు జీసీసీ కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి రేషన్ ఇవ్వడం కోసం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రేషన్ కొండలపైకి మోసుకుని తీసుకువెళ్తూ గిరిజనులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

రాజాంలో స్థిర పారిశుద్ధ్య వ్యవస్థ

- కేంద్ర జలశక్తి ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్
- రాజాం మండలం యూనిట్‌గా ఎంపిక

రాజాం: స్థిరమైన పారిశుద్ధ్య వ్యవస్థ నిర్మాణ దిశగా కేంద్ర జలశక్తి, జీఎంఆర్ ఫౌండేషన్‌లు సంయుక్తగా కృషిచేస్తున్నాయని కేంద్ర జలశక్తి ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ టీం లీడర్ సంజయ్‌కుమార్ పాండే, డిప్యూటీ కన్సల్టెంట్ శృతి మక్కర్ అన్నారు. స్వచ్ఛభారత్ ఫేజ్-2లో భాగంగా పారిశుద్ధ్య వ్యర్థాల నిర్వహణ కోసం కొత్త ప్రమాణాల ద్వారా గ్రామాలను లైట్ హౌస్ ఇనిషియేటివ్‌గా తయారుచేసేందుకు రాజాం మండలాన్ని ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ఈ మేరకు రాజాం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజేష్, జేఈ జగన్మోహనరావు తదితరులతో కలిసి గురువారం సంమీక్షించారు. రాజాం మండలంలో పారిశుద్ధ్య పరిస్థితి, వ్యర్థాల నిర్వహణకు అవసరమైన వనరులు, వసతులపై ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో మట్లాడుతూ మెరుగైన పారి



రాజాంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావుతో సమీక్షిస్తున్న యూనిట్ ప్రతినిధులు

శుద్ధ్యం, పరిశుభ్రత కోసం ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలుచేసేందుకు 15 రాష్ట్రాల్లో 75 గ్రామ పంచాయతీలను కేంద్ర జలశక్తి ఎంపికచేసిందన్నారు. ఇందులో రాజాంకు స్థానం దక్కిందని వెల్లడించారు. జీఎంఆర్ వీఎఫ్‌తో కలిసి రాజాంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. బ్లాక్ స్థాయిలో ఒక స్వచ్ఛసాతీని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ సాయికిషోర్, హెచ్‌ఆర్‌డీ కన్సల్టెంట్ టి.సుధాకర్, ఎంఈఓ రేసీ వైకుంఠరావు, జీఎంఆర్ వీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ముర్రుపాలు అమూల్యం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: బిడ్డ పుట్టిన ఐదు నిమిషాల లోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు ఎంతో అమూల్యమైనవని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఆ పాలలో అద్భుతమైన పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయని, అవి బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాల గొప్పదనం గురించి నిత్యం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మహిళకు దీని గురించి వివరించాలన్నారు. మహిళలు బిడ్డకు పాలు అందించేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లలో బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే ఉన్నట్లయితే వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ తల్లి కావడమే గొప్ప అదృష్టమన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే పాలు అందించడం తల్లి బిడ్డలిద్దరికీ శ్రేయస్కరమన్నారు. ఆ తర్వాత గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ 5వ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ శాంతికుమారి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ హిమబిందు, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, డీఎల్‌ఓ డాక్టర్ రాణి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి అన్నపూర్ణ, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతి శ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, నేచర్ సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజ్, ఘోషా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత పాల్గొన్నారు.



గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న మహిళలు, పాల్గొన్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

తప్పుడు రిజిస్ట్రేషన్ కలకలం

- సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రశ్నించిన రైతు

భోగాపురం: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్‌పై కలకలం రేగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గూడెపువలసకు చెందిన రైతు ఆళ్ల ముకుందరావు తాతయ్య పేరు మీద ఉన్న 2.49 ఎకరాల భూమిని, వారసత్వ ఆస్తిగా కుమారుడైన శంకాబత్తుల అప్పలగురువుకు వచ్చింది. ఆయన మృతి చెంది మూడేళ్లు అయినప్పటికీ.. బతికున్నట్లు బినామీ డాక్యుమెంట్లు సృష్టించి ఆ భూమిని ఇద్దరి పేరుమీద ఆన్‌లైన్ చేసేశారు. ఎలాంటి వన్‌బీ, గానీ, ఈసీ గాని చూడకుండా ఎక్కడో సృష్టించిన డాక్యుమెంట్ల ఆధారంగా తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. దీనిపై భూహక్కుదారుడైన ఆళ్ల ముకుందరావు తనకు చెందాల్సిన భూమికి సంబంధించి రిజిస్ట్రార్ దగ్గరికి వెళ్లి జరిగిదంతా చెప్పడంతో రిజిస్ట్రార్ ఒక్కసారిగా కంగుతిన్నారు. ఈ విషయం బయట పెట్టొద్దని దీనిపై పరిశీలిస్తానన్నారంటూ రిజిస్ట్రార్‌పై ముకుందరావు ఆగ్రహం వ్యక్తం చేశాడు. సర్వే నంబర్ 159-2లో ఎకరం భూమి అరం జ్యోతి పేరు



తనకున్న డాక్యుమెంట్లు చూసించి సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న రైతు ముకుందరావు

మీద ఉండగా మళ్లీ అదే సర్వే నంబర్ మీద 2.49 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించేశారు. తనకు సంబంధించిన ఆస్తులను ఎలా తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తారంటూ ముకుందరావు ప్రశ్నించాడు. డబ్బులకు అమ్ముడుపోయి ఇలా చేయాడం మీకు తగదని న్యాయం జరిగే వరకు విడిచి పెట్టనని అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానం టూ హెచ్చరించాడు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ముకుందరావు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమణమ్మ ఆయనకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

10న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, కార్యదర్శి జి.లక్ష్మణరావులు గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ఎల్‌కోట మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ ప్రాంగణంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి 2వ తేదీ అనంతరం, జూనియర్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 2వ తేదీ అనంతరం జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొన బోయే క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ ,స్టడీ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్లలోకి అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 90524 57201, 95818 86936 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- రహదారులపై అక్రమణలు తొలగించాలి
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రహదారులపై అక్రమణలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం గురువారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలు తీసుకోవడమే కాకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. రహదారులు, జంక్షన్‌లు, బ్లాక్ స్పాట్స్, పాఠశాలల వద్ద ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఐఆర్‌ఏడీ యాప్‌లో రోడ్డు ప్రమాద వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఐఆర్‌ఏడీ యాప్‌పై అన్ని శాఖల అవగాహన కోసం జూమ్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. రోడ్లు భవనాలు, పోలీసు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త బృందాలు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత సమావేశం నుంచి ఇప్పటివరకు పెండింగ్ ఉన్న కేసులను తక్షణమే క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.కాంతిమతి, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి, విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఎంవీఐ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

సహాయక చర్యలందక వ్యక్తి మృతి



ధనుంజయ మృతదేహం



ధనుంజయ (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట పరిధిలో బుధవారం ప్రమాదవశాత్తు కింద పడిపోయిన వ్యక్తికి సకాలంలో సహాయక చర్యలందకపోవడంతో మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నాయుడువలస పంచాయతీ మధుర గ్రామం కొండపాలవలసకు చెందిన లెంక ధనుంజయ(33)ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. రోజులాగానే బుధవారం కూడా ట్రాక్టర్ తోలడానికి వెళ్లిపోయి అదే మండలం ఆరికతోట గ్రామ పొలంలో మొక్కజొన్న కంకులు రెండు లోడులు పెరిగాడు. మూడో లోడుకు వెళ్లకుండా పొలంలో ట్రాక్టర్ వదిలేసి చెట్ల నీడకు వెళ్దామన్న ఉద్దేశంతో అక్కడికి కొద్ది దూరంలో ఉన్న నీలగిరి తోటలోకి వెళ్తుండగా తోటలో గతంలో నరికిన చెట్ల మొదళ్లు తన్నుకుని కంకర రోడ్డులో బోర్లా పడిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పాటు ఎండవేడిమి ఎక్కువగా ఉండడంతో వెంటనే సహాయక చర్యలందక మృతిచెందాడు. బుధవారం రాత్రికి కూడా ధనుంజయ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. మద్యం తాగే అలవాటు ఉన్నోడు కదా ఏదో టైమ్‌లో ఇంటికి వచ్చేస్తాడులే అన్న ఉద్దేశంతో అలా వదిలేశారు. ట్రాక్టర్ ఓనర్ కూడా వెతికి తన ట్రాక్టర్‌ను తీసుకెళ్లిపోయాడు. గురువారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ట్రాక్టర్ వదిలేసిన పరిసరాల్లో మళ్లీ వెతికారు. అయినా కనిపించకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోతున్న సమయంలో ఆరికతోట గ్రామానికి చెందిన ఓ రైతు గడ్డిమోపు పట్టుకుని కనిపించి నీలగిరి తోటలో ఎవరో పడి ఉన్నారని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి అప్పటికే మృతిచెంది ఉన్న ధనంజయను చూసి అవాక్కయ్యారు. బోర్లా పడి ఉన్న మృతదేహం ముఖంపై రక్తం మరకలు ఉండడం చూసి ఎలా మృతి చెంది ఉంటాడు? ఎవరైనా చంపి పడేశారా? మృతుడికి ఎవరూ శత్రువులు లేరే అని ఆలోచించి అనుమానాస్పద మృతిగా భావించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి ఘటనా చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సాధారణ మృతా? లేక హత్యా? అని పరిశీలించి సాధారణ మృతిగా నిర్ధారించారు.కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య గౌరీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గౌరీశ్వరి, పాప, బాబు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శివకుమార్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సీతంపేట: స్థానిక సొండివీధికి చెందిన నల్లా శివకుమార్ (34) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఒడిశాలోని గజపతి జిల్లా రసూరుకు చెందిన జ్యోతితో ఏడాది కిందట శివకుమార్‌కు వివాహం జరిగింది. తల్లిదండ్రులు వెంకట్, విజయలక్ష్మితో పాటు శివకుమార్, భార్య జ్యోతి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వారింట్లో ఇటీవల కుటుంబ తగాదాలు ఎక్కువవడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా ఇంటికి వచ్చి చూసిన తండ్రి వెంకటరావు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి ఆటోలో తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు.

పురుగు మందు తాగి వ్యక్తి..



ఎండ చిరంజీవి మృతదేహం

గజపతినగరం రూరల్: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండ.చిరంజీవి పురుగు మందు తాగి జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ మృతుడి తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చిరంజీవి నిత్యం మద్యం తాగుతూ తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా భార్యతో గొడవ పడడంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగు మందును తాగేశాడు. స్థానికుల సాయంతో కుటుంబసభ్యులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.